క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరికలు



ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన పలువురు మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు మాజీ సర్పంచ్ దమోదర్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి సమక్షంలో 50 మంది బీఆర్ఎస్, బీజేపీకి చెందిన మహిళలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

కాశీవిశ్వేశ్వర ఉత్సవాలు



మరికల్: మండల కేంద్రంలోని ఆదిహన్మన్ల ఆలయ ఆవరణలో వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి ఉత్సవాలను సోమవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి విగ్రహాన్ని ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలు ప్రారంభించారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బాధితుడికి పరామర్శ



మరికల్: మండల కేంద్రానికి చెందిన వడ్ల భాస్కరాచారి రెండు నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతుండగా సోమవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు రతంగపాండురెడ్డి పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలు తెలుసుకొని ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రాజేష్, రమేష్, శ్రీరామ్, వెంకటేష్ పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

దామరగిద్ద: అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలోని బ్యాంక్ ఆవరణలో ధర్నా నిర్వహించనున్నట్లు ఆ సంఘం మండల కార్యదర్శి పెద్దింటి తాయప్ప సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన రూ.రెండు లక్షల పంట రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టే ధర్నాకు రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నర్సిరెడ్డికి ఘన నివాళి



దామరగిద్ద: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివంగత మాజీ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ ఈదప్ప, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ సమక్షంలో పార్టీ నాయకులు నర్సిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నారాయణపేట నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా నర్సిరెడ్డి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో శరణ్యనాయక్, అశోక్, ఖాజా, వెంకటప్ప ఆనంద్, రఘు, లక్ష్మణ్, మాణిక్యప్ప పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



లోకేశ్వర్‌రెడ్డి (ఫైల్)

ఊట్కూర్: యువకుడు అదృశ్యమైన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని ర్యాలంపాడుకు చెందిన లోకేశ్వర్‌రెడ్డికి, ఊట్కూర్‌కు చెందిన జ్యోతితో ఆరేళ్ల క్రితం వివాహమైంది. ఊట్కూర్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ భరత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. లోకేశ్వర్‌రెడ్డి (32)కి అనారోగ్యం ఉండడంతో మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని గాంధీ న్యూరో ఆస్పత్రికి వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణంరాజు తెలిపారు.

వార్డుల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తాం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని అన్ని వార్డుల్లో నెలకొన్న సమస్యలను సాధ్యమైనంతవరకు పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం 8వ వార్డు పరిధిలోని పద్మావతీకాలనీలో, 22వ వార్డులోని మైత్రీనగర్‌లో పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. పద్మావతీకాలనీలో దెబ్బతిన్న సీసీ రోడ్లను, మైత్రీనగర్‌లోని లోతట్టులో ఉన్న సీసీరోడ్డు వర్షపు నీరు మడుగులా ఉండటాన్ని, అలాగే కాలనీలో చాలాచోట్ల ఇప్పటికీ మట్టిరోడ్లే ఉండటాన్ని గమనించారు.



ఉట్టి కొడుతున్న చిన్నారులు



చిన్నారులతో ఉపాధ్యాయులు



ఊట్కూర్‌లో..

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు



దామరగిద్దలో కోలాటం ఆడుతున్న చిన్నారులు



ధన్వాడలో..

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కృష్ణాష్టమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రముఖ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కృష్ణుడికి డోలారోహణం చేశారు. యాదవులు కృష్ణుడు విగ్రహాలు, చిత్రపటాలతో పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో విద్యార్థులు కృష్ణుడి, గోపికల వేషధారణతో చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. సాయంత్రం వేళల్లో ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. విజేతలకు గ్రామ పెద్దలు నగదు పురస్కారాలతో సత్కరించారు. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు దాతలు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.













పగిడిమారిలో అంగన్‌వాడీ కేంద్రంలో.. మక్తల్‌లో శ్రీకృష్ణుడి, గోపికల వేషధారణ, కాన్‌కుర్తిలో గోపిక కృష్ణులు వేషధారణలో చిన్నారులు

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



గణపతి పూజ నిర్వహిస్తున్న ట్రస్టు సభ్యులు

మద్దూరు: పట్టణంలోని గీతాంజలి ఉన్నత పాఠశాల సమీపంలో నిర్మించిన గణపతి, నంది, దత్తాత్రేయ సహిత సాయిబాబా ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమంలో రాఘవశర్మ బృందం ఆధ్వర్యంలో మొదటి రోజు గురువందనంతో ప్రారంభించారు. సేవా సమితి ట్రస్టు సభ్యులు బర్లమల్లికార్జున్, వార్ల సిద్ధిలింగం, వెంకటేష్, నర్సింహులు, గోవర్ధన్ దంపతులు హోమం నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. మంగళవారం విగ్రహాల ఊరేగింపు, ధాన్య, జల, శయ్యాధివాసాలు నిర్వహించి, హోమాలను చేయనున్నట్లు రాఘవశర్మ తెలిపారు.

సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యం



ఊట్కూరులో గాయత్రి యజ్ఞంలో పాల్గొన్న ఆర్య సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు విఠల్‌రావుఆర్య

ఊట్కూరు: భారతీయ సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేద్దామని ఆర్యసమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు విఠల్‌రావుఆర్య అన్నారు. ఊట్కూరులో సోమవారం ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో శ్రావణమాసం, గాయత్రి త్రిదివసి మహాయజ్ఞం, పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించగా.. ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో నిర్మించిన కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలని కోరుతూ ప్రధాని మోదీకి ఆర్యసమాజ్ తరుపున వినతిపత్రం అందించడం జరిగిందని అన్నారు. బంగ్లాదేశ్ ఒకప్పుడు భారత దేశంలో భాగమని అక్కడి హిందువులపై అఘాయిత్యాలు, దాడులు, హత్యాచారాలు జరగడం శోచనీయమనఅనరు. దేశంలో పాశ్చాత్య సంస్కృతి పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు చిన్నప్పటి నుండే సనాతన ధర్మం పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఇంట్లో నిత్యం అగ్నిహోత్రం జరగాలని, దీపారాధన, హారతి తదితర కార్యక్రమాలు యజ్ఞంతో ముడిపడి ఉన్నాయని అన్నారు. సనాతన వైదిక ధర్మంతో ఋషులు, మునులు యజ్ఞాలు, యాగాలు నిర్వహించేవారని, యజ్ఞాల వల్ల వాతావరణ కాలుష్యం నివారించబడుతుందని, వేధాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కనకప్పార్య, పండిత్ ప్రియదత్తుశాస్త్రీ, వానప్రస్త మహామునిఆర్య, జ్ఞానేశ్వర్‌ఆర్య, బాలరాజు, సుధాకర్, దివాకర్, గోల్ల రాములు, శేకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలి



అమరచింతలో మదర్‌థెరిస్సా విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కేశం నాగరాజ్‌గౌడ్, తదితరులు

అమరచింత: ప్రతి ఒక్కరూ ఆపద సమయంలో ఉన్న ఇతరులకు సేవ చేసే గొప్ప గుణం కలిగి ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, ఎస్‌ఐ సురేష్ అన్నారు. మదర్‌థెరిస్సా జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో నవోదయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నవోదయ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు నిరుపేదలకు చీరలు, బట్టలు పంపిణీ చేశారు.

తల్లిదండ్రులను విస్మరించొద్దు

కని, పెంచిన తల్లిదండ్రులను విస్మరించడం శోచనీయమని, తల్లిదండ్రులకు సేవ చేయలేని వారు ఉన్నా.. లేనట్లే అని కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు తమ కొడుకులు పట్టించుకోవడం లేదని పోలీసుస్టేషన్ మెట్లు ఎక్కడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో నవోదయ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు శ్యాంసుందర్, శ్యాంసోన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, అజయ్, విష్ణు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి



నారాయణపేట రూరల్: క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మినీ స్టేడియంలో పీఈటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాల స్థాయి క్రికెట్ పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. మూడు రోజులుగా లీగ్ మ్యాచ్‌లతో పాటు మూడు క్వార్టర్ ఫైనల్ పోటీలను పూర్తి చేశారు. సోమవారం జరిగిన హోరాహోరీ పోరులో శ్రీహంసవాహిని స్కూల్, ఎయిడెడ్ వైదిక పాఠశాల, గురుకుల పాఠశాల జట్లు సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లాయి. ప్రభుత్వ గ్రౌండ్ స్కూల్, కొల్లంపల్లి జెడ్పీ స్కూల్ మధ్యలో జరిగే మ్యాచ్‌లో గెలిచిన వారు సెమీఫైనల్‌లో తలపడనున్నారు. ఈ మేరకు అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి రమణ హాజరై టాస్ ఎగరవేసి మ్యాచ్‌లను ప్రారంభించారు. గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు చెల్లించాలి



అమరచింత: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు రూ.8వేల కోట్లు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో విద్యాసంస్థల యాజమాన్యం విద్యార్థులను కళాశాలల నుంచి ఇంటికి పంపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2021–22 విద్యా సంవత్సరం నుంచి స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీటిని చెల్లించడంలో నిర్లక్ష్యం వహించిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సోయబ్, నవాబ్, మహిబ్, విశాల్, అనురాగ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

ధన్వాడ: మండలంలోని కంసాన్‌పల్లిలో పట్టపగలే చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన గజ్జ భీమ్మమ్మ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా గుర్తు తెలియని వ్యక్తి కారం పొడి కంటిలో చల్లి మెడలో ఉన్న రూ.35వేల విలువ గల అర తులం బగారం గొలుసు లాక్కెళ్లి పోయాడు. బాధితురాలి కొడుకు ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కొత్తగార్లపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలి

మక్తల్: మున్సిపాలిటీ పరిదిలోని కొత్తగార్లపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామ విద్యార్థులు సోమవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. గ్రామం నుంచి నడుచుకుంటూ మక్తల్‌కు ఉన్నత చదవుల కోసం వెళ్తున్నామని, బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



గార్లపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతి

చిట్టెం నర్సిరెడ్డి ఆశయాలను నెరవేరుస్తా..

మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

కృష్ణా: మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి ఆశయాలను, ఆకాంక్షలను నెరవేరుస్తామని ఆయన తనయుడు మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. నర్సిరెడ్డి 91వ జయంతి సందర్భంగా సోమవారం టైరోడ్‌లోని నర్సిరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరంతరం ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండి వారి శ్రేయస్సే లక్ష్యంగా పని చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కృష్ణా వైస్ ఎంపీపీ ఈశ్వరప్పగౌడ, బీఆర్ఎస్ మండల నాయకులు శివరాజ్‌పాటీల్, శివప్ప, అంబ్రేష్, సురేష్, గిరిణి శివప్ప, శంకప్ప, రవి, భీమ్, మాగనూర్ మండల నాయకులు మల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిట్టెం నర్సిరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంపీ, మాజీ మంత్రి



మక్తల్ మార్కెట్ మాజీ చైర్మన్ నర్సింహాగౌడ్‌ను పరామర్శించిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మక్తల్: మక్తల్ మార్కెట్ మాజీ చైర్మన్ నర్సింహాగౌడ్ పెద్ద కుమారుడు అమృతగౌడ్ తమిళనాడులో కారు ప్రమాదంలో మృతి చెందడంతో సోమవారం మార్కెట్ మాజీ చైర్మన్ నర్సింహాగౌడ్‌ను ఎంపీ డీకే అరుణ, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌లతో పాటు ఇతర నాయకులు పరామర్శించారు. సంఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు కొండయ్య, కర్ని స్వామి, రాజశేఖర్‌రెడ్డి, బాల్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నారాయణపేట రూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని ఏఎస్ఐ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్ల అద్దాలకు బ్లాక్ ఫిలిం ఉపయోగించరాదని, తొందరపాటుతనంతో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలన్నారు. వాహనాలకు నెంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని, వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించి సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు.



అంబేడ్కర్ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

నేడు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం



అభయాంజనేయస్వామి ఆలయం

నారాయణపేట రూరల్: పట్టణంలోని అశోక్‌నగర్ అభయాంజనేయస్వామి ఆలయంలో బజరంగదళ్ యువజన సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ధ్వజస్తంభ, బొడ్రాయి స్థాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు కుంటిమారి నర్సింహులు, అధ్యక్షుడు అమ్మపల్లి చెన్నారెడ్డి తెలిపారు. మంగళవారం గోపూజ, ధ్వజారోహణం, యాగశాల ప్రవేశం, శిఖర కలశం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అదేవిధంగా బొడ్రాయి ఊరేగింపు గొడుగు గేరీ అభయాంజనేయస్వామి ఆలయం నుంచి అశోక్‌నగర్ అభయాంజనేయ స్వామి ఆలయం వరకు శోభయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రత్యేక పూజలు, మృత్యుంజయ హోమం, పూర్ణాహుతి, ధాన్యాధివాసము, భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. బుధవారం యాగశాల ప్రవేశం ధ్వజస్తంభ, బొడ్రాయి, కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ప్రతిష్ఠాపన కార్యక్రమాల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కర్రెమ్మ దేవి ఉత్సవాలు ప్రారంభం



కర్రెమ్మ దేవి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని తొమ్మిదో వార్డు పళ్ల హరిజనవాడలో కర్రెమ్మ దేవి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా యాదగిరి రోడ్డు శివాలయం నుంచి అమ్మవారి శోభాయాత్ర ఖడ్గ విన్యాసాలు, మేళతాళాలతో పురవీధుల గుండా వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణానికి చేరుకొని వేదమంత్రోచ్చరణతో గోపూజ, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణం, కలశ స్థాపన, నవగ్రహ పూజ, మండపారాధన, జలాధివాసం పూజలు చేశారు. శోభాయాత్రలో డప్పు చప్పుళ్ల మధ్య పోతురాజుల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు,అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఉత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని దేవిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.



ఆకట్టుకున్న పోతురాజు విన్యాసాలు

పొంచి ఉన్న ప్రమాదం

మాగనూర్: మండల కేంద్రంలోని వర్కూర్ క్రాస్‌రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. ఇక్కడ నాలుగు రహదారులు కలుస్తుండడం, ఏటు వైపు నుంచి ఏ వాహనం వస్తుందో తెలియని అయోమయ పరిస్థితి ఉంటుంది. ఎస్‌హెచ్–167 రహదారి విస్తీర్ణ పనులో భాగంగా గ్రామంలో నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం చేపట్టారు. అది క్రాస్ రోడ్డుగా మారడంతో సమస్య మరింత జఠిలమైంది. అధికారులు సూచిక బోర్డులు పెట్టినా వాహనాల వేగానికి అవి కనిపించకపోగా, ఇక్కడ ఇప్పటికే అనేక ప్రమాదాలు సంభవించాయని వాహనదారులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల నుంచి వచ్చే రహదారులకు స్పీడు బ్రేకర్లు వేయడంతో పాటు కూడలి వద్ద జిగ్‌జాగ్ లేదా వేగ నియంత్రణ బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాలు అరికట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న నాలుగు రహదారుల కూడలి